


— డి. హరనాథ్ రెడ్డి

నల్లగా, దట్టంగా చీకటి మేఘాలు.
కరమైన ఉరుములు.

భయంకరమైన మెరుపులు.

అమ్మవారు పూనినట్టు గాలిదేవుని విలయ తాండవం.

కుండపోతగా వర్షం. వర్షం.

అప్పుడా రామయ్యపాలెంలో అంబోతులు రంకెలు వేస్తున్నాయి, క్రూరంగా.

గుర్రాలు సకిలిస్తున్నాయి ఘోరంగా.

క్రూరంగా రంకెలువేస్తూ, ఘోరంగా సకిలిస్తూ పరుగులు తీస్తున్నాయి. ప్రళయం వచ్చినట్టు, పిచ్చెక్కినట్టు అటూ, ఇటూ పరుగులు తీస్తున్నాయి.

కుమ్ములాడుకోవడానికి రామాలయం దగ్గరున్న ఓపెన్ ప్లేస్ లోకి పరుగులు తీస్తున్నాయి అంబోతులూ, గుర్రాలూ.

* * *

రామయ్యపాలెం ఒక పెద్ద ఊరు.

ఆ ఊరు ఒక పెద్ద పట్టణం అంచున ఉంది.

ఆ ఊళ్ళో మేడలు రెండని లెక్క పెట్టచ్చు; పెంకిటిళ్ళు పదని లెక్క పెట్టచ్చు. కాని, కమ్మరిళ్ళు ఇన్నని చెప్పి లెక్కపెట్టడం కష్టం. సైజూ, షేపూ, వరసక్రమం లేకుండా ఉంటాయా కమ్మరిళ్ళు. ఆ ఇళ్ళు ఎలా ఉంటాయంటే పెద్ద సంచిలోంచి చిలుక్కుమని వంపేసిన వక్క పిడతల్లా చిందరవందరగా ఉంటాయి. ఆ ఊళ్ళో సందులూ, గొందులూ, వాడలూ

ఉండటమే కాకుండా రెండు పేటలు కూడా ఉన్నాయి.

ఒక పేట పేరు — అంబోతుల పేట.

రెండో పేట పేరు—గుర్రాలపేట.

అంటే అంబోతుల పేటలో అంబోతులూ, గుర్రాల పేటలో గుర్రాలూ ఉండడం లేదు. మనుషు లుంటున్నారు.

ఆ మనుషులంతా వర్కుషాపుల్లోనూ, ఫాక్టరీలల్లోనూ, లారీల్లోనూ, కొండ దగ్గర రాళ్ళు కొడుతూనూ కూలి పనులు చేసుకు బతుకుతున్న వాళ్ళు.

గొప్పవాళ్ళపేర్లూ, పెద్దవాళ్ళపేర్లూ ఊళ్ళకీ, వీధులకీ, పార్కులకీ, మార్కెట్లకీ, బస్ స్టాండ్లకీ, ఏటికీ, పేటకీ— చివరికి మంగలి షాపులకీ పెడుతుండడం మనం తరుచూ చూస్తుంటాం.

అలాగే రామయ్యపాలెంలో కూడా ఆ రెండు పేటలకి ఇద్దరు పెద్దల ఇంటి పేర్లు పెట్టారన్న మాట.

వివరంగా చెప్పాలంటే — అంబోతుల పేట పెద్ద పేరు అంబోతుల అప్పారావు.

గుర్రాల పేట పెద్ద పేరు గుర్రాల గంగరాజు.

అప్పారావు, గంగరాజు మటుకు కూలీలు కారు. వాళ్ళకు కూలి పనులు చేయడ మేం ఖర్మ? (కూలీలతో పనులు చేయించుకొని) మేడమీద మేడా, బాంక్‌లో అకౌంటూ, స్థిరాస్తి, అస్థిరాస్తి, పలుకుబడీ, హోదా, మర్యాదా, పరువూ, పొట్టా పెంచుకోగల పెద్ద మనుషులు; పెంచుకుంటున్న పెద్ద మనుషులు. ఆ ఊళ్ళో కనిపిస్తున్న ఆ రెండు మేడలూ వాళ్ళిద్దరివే. అద్దె కిచ్చేసిన పెంకుటిళ్ళు వాళ్ళిద్దరివే. కమ్మరిళ్ళు మటుకూ వాళ్ళిద్దరివీ కావు గాని, ఆ ఇళ్ళు ఉన్న స్థలాలుమటుకు వాళ్ళవే.

ఆ ఇద్దరు పెద్దమనుషులకీ పడదు అందుచేత ఆ ఊళ్ళో ఆ రెండు పేటలకీ పడదు. పడదు.

వాళ్ళిద్దరికీ పడితేనే ఆ రెండు పేటలకీ పడుతుంది. వాళ్ళు చల్లగా ఉంటేనే ఆ ఊరు చల్లగా ఉంటుంది. వాళ్ళు శాంతిని కాంక్షిస్తేనే ఆ ఊరు అతి శాంతంగా, ప్రశాంతంగా ఉంటుంది. వాళ్ళు నిప్పులు కక్కితే ఊరు భగ భగ మండపోతుంది. వాళ్ళు నవ్వులు విసిరితే పూలవాన కురుస్తుందో, కురవదో గాని వాళ్ళు కత్తులు విసురుకుంటే మటుకు ఊరు ఊరంతా రక్తపుటేరై పోతుంది.

అసలు మొదట ఆ ఊరిలో రెండు పేటలూ లేవు. ఏ పేటలూ లేకుండా ఉండేది ఊరు రామయ్య పాలెం. అప్పుడా ఊరికీ కూడా ఒకటే రాజు ఉండేవాడు. అతడు గంగరాజు...గుర్రాల గంగరాజు.

అప్పుడా గుర్రాల గంగరాజే రాజ్యం సగం పోగొట్టుకొని సామంతరాజై పోయాడు.

గంగరాజు అప్పుడూ, ఇప్పుడూకూడా పేరుమోసిన కంట్రాక్టరు.

అంబోతుల అప్పారావు కూడా కాంట్రాక్టరే గాని, అప్పుడు చిన్న గుమాస్తా మాత్రమే.

గుమాస్తా ఏ కంపెనీలోనో, ఏ కిరాణా దుకాణంలోనో కాదు. గంగరాజు దగ్గరే గుమాస్తా.

అరవై రూపాయల జీతానికి గుమాస్తాగా కుదిరాడు అప్పారావు.

అయితే, 'నీ విచ్చే జీతం తక్కువ' అని కూలీలను వెనకేసుకుని గంగరాజు మీద తిరగబడలేదు అప్పారావు.

గంగరాజు ఇంట్లో రెండు కుక్కలుండేవి. ఆ కుక్కలకన్నా విశ్వాసంగా ఉండేవాడు అప్పారావు. నాలుక చాపుతూ, తోక ఊపుతూ ఆ పనీ, ఈ పనీ అనకుండా గొడ్డుకన్న ఘోరంగా, కుక్కకన్న హీనంగా గంగరాజుకి సేవ చేశాడు.

విశ్వాసంగా ఉండే కుక్కంటే యజమాని కెప్పుడూ ఇష్ట ముంటుంది. అందుచేత గంగరాజు అప్పారావు వీపుమీద ఆప్యాయంగా నిమిరాడు. జీతం పెంచాడు. గుర్రంలాంటి గుంటని తెచ్చి తన ఖర్చుతో పెళ్ళి చేశాడు. ఇల్లు కట్టించి ఇచ్చాడు.

అంతేకాక — వెధవ గుమాస్తాగిరి వదిలేసి 'సబ్—కంట్రాక్టులు' చేసుకోమన్నాడు.

అదే గంగరాజు చేసిన పొరపాటు.

అప్పారావుకి ఇల్లూ, పెళ్ళాం, కూడూ బట్టా ఇచ్చి ఊరుకోకుండా సబ్—కంట్రాక్టులు వాడికివ్వడం తన జీవితంలో మొదటిసారిగా తెలివి తక్కువగా ప్రవర్తించా నంటాడు గంగరాజు. ఎక్కి కోడి మాంసం రుచి మరిగాక ఊళ్ళోకి రాకుండా ఉంటుందా?

సబ్—కంట్రాక్టులు చేస్తూ, నవ్వుతూ కంట్రాక్టులోని కిటుకులూ, మాయలూ పూర్తిగా తెలుసుకుని, పెద్దవాళ్ళని పట్టేసి, తన కంట్రాక్టులకే ఎసరెడతాడనీ, తనకే టెండరు పెడతాడనీ కలలో కూడా ఊహించలేకపోయాడు గంగరాజు.

తనను ప్రేమగా నాకే కుక్కే కసిగా కరుస్తుం దనుకోలేదు.

తను పాలు పోసి పోషించిన పిల్లే పులై పంజా విసురుతుం దనుకోలేదు.

తెల్లగా ఉంటే పాలే అనుకున్నాడు గాని, విష మనుకోలేదు.

'అమ్మో! అమ్మో! ఎంత మాయ చేశాడు! పాలిచ్చిన తల్లి రొమ్మునే కామం కళ్ళతో జూస్తాడా!' గుర్రాల గంగరాజు ఒళ్ళు కుతకుత మండిపోయింది. కొంతమంది జనాన్ని వేసుకొని అప్పారావుని చితక బాదేయడాని కెళ్ళాడు.

ఇప్పుడు అప్పారావు పట్టి అప్పారావు కాదు. అంబోతుల అప్పారావు. బోలెడు డబ్బు సంపాదించేశాడు. బోలెడు బలగం సమకూర్చుకున్నాడు. ఒక పొజిషన్ కొచ్చాక ఎటాక్ ఇద్దామన్న పథకం ముందే వేసుకున్నాడు కాబట్టి గంగరాజు, గంగరాజు మనుషుల ఎదుట డబుల్ స్ట్రెంగ్తుతో ధీటిగా నిలబడ గలిగాడు అప్పారావు.

రెచ్చగొట్టాలేగానీ, మనుషుల్లో కుల తత్త్వం, ప్రాంతీయతత్త్వం లావాకన్నా భీకరంగా, మండే కమ్మకన్నా సరసరగా, పెట్రోల్‌కన్నా భయంకరంగా, తుపాను కన్నా బీభత్సంగా, గాలికన్నా వేగంగా పిచ్చిగా చెలరేగి విజృంభించి, వికటాట్టహాసం చేసి కన్నూ మిన్నూ కానకుండా అమానుషంగా ప్రజ్వరిల్లి ప్రాణాలుకూడా తినేయగలవు.

---

## ముందు — వెనుక

**మనిషి ఒకే స్థితిలో ఎప్పుడూ ఉండలేడు. సుగుణాలతో, సుకృతాలతో దైవత్వంవైపుకైనా వెడుతుంటాడు; అకృత్యాలతో, దుర్గుణాలతో అధోగతిలోనైనా ప్రయాణం చేస్తుంటాడు.**

—కోలరిడ్జ్

---

అప్పారావు అదే రెచ్చగొట్టాడు. గంగరాజు చేసింది కూడా అదే. అయితే, ప్రాణాలు పోలేదు. కొట్లాటలు అంతగా జరగలేదు.

కాని, రామయ్యపాలెంలో రెండు గ్రూపులూ, రెండు కులాల ముఠాలూ, ఆవేశకావేషాలూ వచ్చేయడం వల్ల రెండు పేటలు ఏర్పడక తప్పలేదు.

మొదట రామయ్యపాలెం — రెండు పేటలూ పుట్టక ముందు పెళ్ళి పీటల మీద కూర్చున్న పెళ్ళికూతుర్లా కళకళ్ళాడుతుండేది. పళ్ళ బరువుతో, పెక్కు కొమ్మలతో ఒత్తుగా, పచ్చగా, చల్లగా ఉండే మామిడి చెట్టులా ఉండేది. అప్పుడు ఊళ్ళో ప్రజలంతా ఐక్యంగా ఉండటం వల్ల చందాలతో మహాయాసంగా రామాలయం కట్టించారు. గ్రంథాలయం పెట్టించారు. మునిసిపాలిటీతో సంబంధం లేకుండా సందు, గొందుల్లోనూ సిమెంటు రోడ్లు వేశారు. ఊరి పొలిమేరలో వెలిసిన కుంచాలమ్మ తల్లికి చక్కని గుడి కట్టించారు. ప్రతి ఏటా అక్కడ భలే గొప్పగా సంబరం జరిగేది. అది చూడాలేగాని చెప్పలేం. బళ్ళవేషాలూ రికార్డింగ్ డాన్సులూ, ఖరీదైన సెట్టింగులూ, కోయ డాన్సులూ, కర్రసాములూ— ఒకటేమిటి ఇలాంటి వెన్నో. కుంచాలమ్మ సంబరం చూడ్డానికి చుట్టుపక్కల ఊళ్ళ నించి వచ్చేవారంటీ జనం ... అబ్బ! ఇసుకేస్తే రాలనంత జనం.

శ్రీరామనవమి ఉత్సవాలైతే మరీను. రంగు రంగు బల్బుల డెకరేషన్లో, ఫర్లాంగు దూరం దాకా పచ్చని పందిరితో పూజలు, భజనలతో, మైకులలో తొమ్మిది రోజులూ దివ్యంగా ఉండేది. ఆ తొమ్మిది రోజులూ రోజుకొక్క ఖరీదైన ప్రోగ్రామ్ —నాజర్ పార్టీ బుర్రకథ, పీసపాటి 'కురుక్షేత్రం', ఎవరో ఒకరు సినిమా స్టార్నీ రప్పించడంకూడా జరిగేది.

అప్పుడు ఆ ఊళ్ళో ప్రజల ఏకత కూడా చెప్పుకోతగ్గది. రామయ్యపాలెం అంటే చుట్టుపక్కల ఊళ్ళకి హడల్. అసూయి! ఒకసారి ఏమయిందంటే, రామయ్యపాలెం లోని ఒక సీతమ్మని పక్క ఊళ్ళోని రౌడీ వెధవలు అల్లరి పెట్టారు. ఇక చూసుకోండి. రామయ్యపాలెం ప్రజలంతా-ఆడనకుండా, మగనకుండా-కత్తులతోనూ, కటారులతోనూ ఆ ఊరి మీద పడ్డారు. అంతే. ఆ ఊరి పెద్దలు బెదిసిపోయి ఆ రౌడీవెధవల తరఫున క్షమాపణ చెప్పడమే కాక, ఆ వెధవలందరూ రామయ్యపాలెం సీతమ్మ కాళ్ళమీద పడ్డారు.

అలాంటి ఊరుకి, వెన్నెల వాడలాంటి ఊరుకి, రత్నాల మేడ లాంటి ఊరుకి దుర్దినాలు దాపురించాయి. కులాలూ, గ్రూపులూ పడగలు విప్పి, బుసలు కొట్టి ఊరుని సమస్తం విషకాలుష్యం చేశాయి—గుర్రాలపేటని, అంబోతుల పేటనీ వికృతంగా పుట్టాయి. ఆ రెండు పేటల మధ్య కొండచిలువ మెలికల్లా జైలుగోడంత ఎత్తుగోడ లేచింది.

అప్పారావు, గంగరాజు తమ కక్షలకీ, ద్వేషాలకీ ఐక్యంగా ఉన్న అమాయక ప్రజల్లో చిచ్చుపెట్టి, రెచ్చగొట్టి వాళ్ళలో వాళ్ళకే దెబ్బలాటలు పెట్టి వినియోగించుకుంటున్నారు. తమ స్వార్థాలకీ ఉపయోగించుకుంటున్నారు.

అంబోతుల అప్పారావు తన దగ్గర పనిచేస్తున్న కూలీల్లో గుర్రాల గ్రూపు వారని అనుమానం వచ్చిన వారినందర్నీ పనుల్లోంచి నిర్దాక్షిణ్యంగా తీయించి పారేశాడు. దీనితో గుర్రాల గంగరాజు సకిలించి, తోక తొక్కిన తాచులా లేచి, కెరటంలా ఊరికి తన పేటలో ఉన్న నాలుగైదు అంబోతుల కొంపల్ని— ఉగాండా నుంచి ఆసియన్లను అమానుషంగా తగిలేసినట్లు తగిలేసి 'దెబ్బ'కు

పర్లైన 'దెబ్బ' కొట్టగలిగానని హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

ఊరు రెండు పేటలుగా విడిపోయినా, దేవుడికి అందరూ సమానులే కాబట్టి, దేవుడు అందరికీ కావాలి కాబట్టి రెండు పేటల వారికీ రామాలయం, కుంచాలమ్మ గుళ్ళు చెందుతాయి. కాని, పల్లీ అక్కడ జరిగే ఉత్సవాలు మటుకూ వేర్వేరే. ఇప్పుడు ఒకే ఆలయం దగ్గర రెండు పందిర్లు వేసి, రెండు మైక్ సెట్లు, రెండు ప్రోగ్రాములు పెడుతున్నారు. ఒకేసారి రెండు డిఫరెంటు మైక్ సెట్లు కావడం వల్ల ఏ పాట అర్థంకాక, భూతాలు అరుస్తున్నట్టుగా ఉంటుంది. దేవుడి యజ్ఞం ముందు పిశాచాల గోలలా ఉంటుంది. ప్రోగ్రామ్ పక్కనే ప్రోగ్రామ్. అందుచేత ఏ ఒక్కడికైనా ఏ ఒక్క ప్రోగ్రామ్ నా అర్థమయితే 'పద్మశ్రీ' ఇవ్వవచ్చు వాడికి. ప్రోగ్రాముల స్టాండర్డు కూడా పడిపోయింది. అంతా చవుకబారు ప్రోగ్రాములు.

కుంచాలమ్మ గుడికి ఇప్పుడు రెండు సంబరా లన్న' మాట. అందుచేత అక్కడ తన్నుకోవడాలూ, తగవులూను. ఇక సంబరం చూడ్డానికి పై ఊళ్ళనుంచి ఇంకేం వస్తారు?

మిగతా వాళ్ళకు పులిలా ఉండే రామయ్యపాలెం పిల్లికన్నా అధ్వాన్నంగా తయారయిందనికూడా చెప్పాలి.

మొత్తాని కేమిటంటే, జరీ అంచు తెల్లచీర కట్టుకొని, తలలో నిండుగా మల్లెలు పెట్టుకొని, వెన్నెల జల్లులా పచ్చే పన్నెల కన్యలా ఉండే రామయ్యపాలెం మాసిన చీరతో, తలలో ప్లాస్టిక్ పువ్వులు పెట్టుకొని పకోడీల పప్పు పచ్చే బజారు ముండలా తయారయింది.

రామయ్యపాలెంలో ఏ రోజు, ఎప్పుడు, ఏ ఉపద్రవం వస్తుందో, ఎన్ని బుర్రలు పగులుతాయో, ఎంత రక్తపాతం జరుగుతుందో చెప్పలేని అయోమయ, ఉద్రిక్త స్థితిలో ఉండగా, ఉంటుండగా— ఆ రోజు 'రక్తపాతం' దివ్యంగా జరుపుకోవడం కోసం అంబోతుల వారు, గుర్రాలవారు ఎవరికి వారు కత్తులు నూరడం ఆరంభించారు.

కత్తులు నూరడం చూసి జడిసి, సూర్యుడు మబ్బుల్లోంచి దూరంగా, ఇంకా దూరంగా పారిపోయాడు.

నల్లమబ్బు రాకాసులు మాత్రం 'రామయ్యపాలెంలో వేడుక' తనివి తీరా చూద్దామని గుంపులు, గుంపులుగా చేరాయి. వేడుక చూడబోతున్నా మన్న ఆనందం భరించలేక ఉరుముల చప్పట్లు కొడుతూ, మెరుపుల మతాబులు వెలిగిస్తూ, ఆనందబాష్పాలు జలజల వదల వారంభించాయి.

ఆ సమయంలో రామయ్యపాలెం ఎలా ఉంది?

పొయ్యిమీద సలసల కాగుతున్న నూనెలా ఉంది. కొంపలు సర్ సర మని అంటుకున్నట్టుంది. అక్కడ మనుషు లంతా శాపం వల్ల రాక్షసులైపోయిన ట్టుంది. ఊరు ఊరంతా అట్టుడికి పోతూంది.

కొంతమంది చేతుల్లో కత్తులూ, కటార్లూ ఉన్నాయి. మరి కొంతమంది చేతుల్లో బెల్లాలూ, చెయినులూ ఉన్నాయి. మరికొందరి చేతుల్లో జడిసెలూ, బాణాకర్రలూ ఉన్నాయి. అందరి నోళ్ళలోంచి బూతులు వస్తున్నాయి. రెండు పేటల మధ్య కావాలని కట్టుకున్న గోడే కొట్టుకోవడానికి అడ్డుగా ఉన్నందుకు ఎవరికి వారికి పిచ్చెక్కినట్టుగా ఉంది. కొట్టుకోవడానికి అనువైన స్థలం రామాలయం ముందున్న ప్రదేశమేనని అనుభవపూర్వకంగా చాలా సార్లు తెలుసుకున్నారు కనకనే అటు నుంచి అంబోతులూ, ఇటు నుంచి గుర్రాలూ అక్కడకు పరుగులు తీస్తున్నాయి. కోళ్ళూ, కుక్కలూ, కుర్రకుంకలూ, గొడ్లూ, గేదెలూ, ఆడాళ్ళూ, అడారాళ్ళు బెదిరిపోయి, చెదిరిపోయి ఎక్కడికక్కడ ఏదో ఒక మూలకి ఒక్కుకుపోతున్నారు.

అంతలోనూ సమయంలో సంగి తంలా ఈదరగాలి.

దబదబ వర్షం.

ఉరుముల మెరుపులు.

మెరుపుల ఉరుములు.

ఇవేమీ పట్టించుకోకుండా 'ఉంటే మీరో, మేమో ఉండాలి. తేల్చుకుందాం రాయనో' అంటే 'రాయనో' అని కొట్లాట కేంద్రం రామాలయం దగ్గరకు అంబోతులు రంకెలు వేస్తూ, గుర్రాలు సకిలిస్తూ భయంకరంగా, కసిగా పరుగులు తీస్తుంటే— అంబోతుల అప్పారావు, గుర్రాల గంగరాజు మాత్రం— చలిగాలికి ఒళ్ళు వణకకుండా వెచ్చని ఊలు బనియనులు వేసుకొని, వర్షం తొంపిరి రాకుండా కిటికీ తలుపులు వేసుకొని కూర్చునో, నిలుచునో లేక అటూ ఇటూ తిరుగుతూనో ఇళ్ళలోనే ఉన్నారు. ఉండి హత్యాకాండ నడిపిస్తున్నారు! జరిపిస్తున్నారు. బాంబులు వదలరు వాళ్ళు, బాంబుల వత్తులు మాత్రమే వెలిగిస్తారు. ఇక్కడ గమ్మత్తు ఏమిటంటే— తగువు పడింది వాళ్ళిద్దరు. కొట్టుకుంటున్నది వీళ్ళంతా!

ఇంతకీ అ. అప్పారావు, గు. గంగరాజు మధ్య వచ్చిన తగువు ఏమిటి?

తగువు ఏమిటంటే—

'ఓ గుర్రాలబ్బాయ్, నీవు చెప్పవయ్యా.

'సత్తెం. సిత్తం.'

ఏటి సెప్పమంటారు, బాబూ, శానా ఘోరం జరిగిపోనాది. మా గంగరాజు బాబుగోర్కి, ఆ ఏధవ సంజీకొడుకు అప్పారావుగోడికీ శానా పెద్ద గొడవే జరిగిపోనాదండి.'

'అసలు గొడవేమిటో చెప్పు?'

'సెబుతున్నా గదు, బాబూ! అప్పారావు గోడి సిన్న కూతురు ఏదేవుది లేదండి? ఆదేనండి కర్రిగుంట. సివిడి ముక్కుది. గేద... పెయ్యినా గుంటాది. ఆదీ ఆ గుంట... ఆ గుంటముండ కూతురు మా వరాల తల్లిని, మా ముద్దుల మూటని, మా గంగరాజు బాబుగోరి సిన్నారి సిన్నకూతుర్ని దండిబా జాడేసిందండి. మా వరాల తల్లికి ఇంత దొండ పెట్టిపోనాదికూడానండి. అంత ఘోరం జరిగిపోనాక మా బాబుగారు ఎలా ఊరుకుంటారు సెప్పండి— సెప్పండి. మీరే సెప్పండి. మా గంగరాజ బాబు అగ్గిమీద గుగ్గిలమై పోయి, మన వరాల తల్లిని ఈడ్చుకొని అప్పారావు కాడ కెళ్ళినాదండి. వాళ్ళ ఇద్దరూ పెద్ద గొడవ పడినారు. గొడవ పడి నూనుకుండారా అంటే నూసుకుండారా అనుకున్నారండి. అంచేత ఆదేదో సూసేద్దాం మరి. అదండి సంగతి.'

'అరె. చాలా చిన్న కారణం. వెరీ స్మాల్ రీజన్!

ఆ మాత్రానికే ఎందు కంత భయంకరమైన పోట్లాట?

చిన్న పిల్ల కొరకడానికి చిన్న బొడు పెట్టితే పెద్దోళ్ళంతా బుర్రలు పగల గొట్టేసుకోవాలా?

అరె, అప్పారావూ, గంగరాజా! మీ రెంతకైనా ఉన్నార్రా.'

ఆకాశంనుంచి సూదిమేకులూ, గుండుసూదులూ పడుతున్నాయూ అన్నట్టుగా కొడుతూంది వర్షం. గాలి పిశాచి ఊపిరిలా భయంకరంగా చప్పుడు చేస్తూ, దారుణంగా వీస్తూంది. చెట్లు కొమ్మలూ, ఇంటికప్పులూ విజవిల్లాడి పోతున్నాయి. కమ్మలు అక్కడక్కడ దూదిపింజల్లా ఎగిరిపోతున్నాయి. వాతావరణమంతా భీకరంగా, భయంకరంగా ఉంది. కాని — రామాలయంలో శ్రీరామచంద్రప్రభువు మటుకు స్వీట్‌గా, ఈజీగా రాతిబొమ్మలోంచి నవ్వేస్తున్నాడు.

రామాలయం ముందు అంబోతులూ, గుర్రాలూ చాలా వరకూ చేరాయి. ఇంకా చాలా వరకు చేరాలి.

కత్తులూ, కటార్లూ, బెల్లాలూ, చెయినులూ, బాణాకర్రలూ లేచాయి గాలిలోకి. పడతాయి తలల మీద. పగులుతాయి తలలు. రక్తం పారుతుంది. ఆ రక్తంలో శ్రీరామచంద్రమూర్తి ఎర్రగా మునిగిపోలాడు.

రామయ్యపాలెమంతా ఎర్ర ఎర్రగా పిండి ఆరేసిన ఎర్రచీరలా అయిపోతుంది. ఇక అంతా అయిపోతుంది! అప్పుడు, అంతా అయిపోతుంది కొన్ని నిమిషాల్లో.

కాని—అంతలో — ఉరుము ఒకటి సింహంలా భీకరంగా ఉరిమింది. కొరడా ఝళిపింపుతో, వెను ఒట్టంలో పిడుగొక్కడో పడింది.

వెంటనే ఒక కేక.

ఉరుముకన్న ఉరుములా కేక...పిడుగుని మించిన పిడుగులా కేక. పెనుకేక.

హృదయవిదారకమైన కేక, గుండెల్ని పిండి చేసే కేక.

'రక్షించండి, బాబోయ్, రక్షించండి.'

ముప్పయ్యేళ్ల స్త్రీ కేక అది.

ఆ కేకలో ప్రార్థనా, ప్రాధేయతా, దైన్యం, ఆక్రందన ఉన్నాయి. ఆ కేకకి కొండలు కరుగుతాయి. రాళ్ళు ద్రవిస్తాయి. అంటటి కేక అది. ఆంతటి ఆర్తనాద మది.

అది అంత శక్తివంతమైన కేక కాబట్టే, అది అంత శక్తివంతమైన ఆర్తనాదం కాబట్టే అంత భీకర గాలి ఆగిపోయింది. అంత వర్షం తగ్గు ముఖం పట్టేసింది.

అంత కొట్లాట స్తంభించిపోయింది.

'ఏమయ్యామ్మా, ఏమయ్యింది?'— గుర్రాలు.

'ఏటయిందమ్మా ఏటయింది?'— అంబోతులు.

కర్కశంగా, కఠోరంగా కొట్టుకుంటున్న వాళ్ళ కంఠాల్లో జాలి!

'పిల్ల కాలవలో పడిపోనాది, బాబోయ్. పిల్లని రచ్చిస్తే మీరు పుణ్యముంటుంది, బాబోయ్!' అని గుండె గట్టిగా బాదుకుంటూ, 'పిల్లని రక్షిస్తే చచ్చి మీ కడుపున పుడతా'ననికూడా విన్నవించుకుంటూంది.

'ఆఁ!'

'ఏ పిల్లమ్మా, ఏ పిల్ల?'

'ఎవరి పిల్ల?'

'నీ పిల్లా?'

'అయ్యో! ఎవరి పిల్ల?'

'ఏ పిల్ల?'

'ఏ పిల?'

'ఎవరి పిల్లయితే నేమి, బాబూ, ఒకరి నిండు ప్రాణాలు నీళ్ళ పాలైపోతున్నాయి.'

'ముందు పిల్లని రచ్చించండి, నాయిన్నారా, రచ్చించండి. రండి, బాబుల్నార్నా, రండి.' ఆమె ముప్పయి గజాల దూరంలో ఉన్న నూతి వైపు పరుగులు తీయ సాగింది.

(తరువాయి 63 వ పేజీలో)

## అడ్డుగోడ

(53 వ పేజీ తరువాయి)

అంతే! కత్తులూ, కటార్లూ, బెల్లాలూ, బెయొనులూ, బడితెలూ, బాణా కర్రలూ— అన్నీ అక్కడే నేల కూలాయి. ఆ కులం, ఈ కులం అనకుండా, ఆ గ్రూపు, ఈ గ్రూపు అనకుండా అంబోతు లన్నీ, గుర్రాలన్నీ ఆమె వెనక పరుగులు తీశాయి.

చిత్రం! ఇంటినీ, పిల్లల్నీ సమస్తం వదిలేసి యుద్ధానికి దిగిన యోధులు ఒక పిల్లను రక్షించడానికి ఆత్రతగా పరుగెడుతున్నారు!

ఒకరి ప్రాణాలు ఒకరు తీసుకోవడానికి సిద్ధమైన ప్రాణులు ఒక ప్రాణిని రక్షించ డానికి పరుగెడుతున్నాయి!

నూతి దగ్గరకు అంత మంది ఆమెతో బాటు చేరారు. ఒక నిమిషం పాటు ఎవరికీ ఏం చేయాలో పాలుపోలేదు. ఆ క్షణంలో అందరూ కులాలూ, గ్రూపులూ గమ్మత్తుగా మరిచిపోయి అంతా ఒకటై పోయి, ఒక కుటుంబమై పోయి— ఒక పిల్లని ఎలా రక్షించాలని ఆలోచనలు చేశారు. దాని కంత ఆలోచన ఎందుకు? ఒక గుర్రాల కుర్రాడు, ఒక అంబోతు లబ్బాయి గబగబా బట్టలు విప్పి ధబుక్కున నూతిలో గెంతారు.

అంతా నూతిచుట్టూ చుట్టూ చేరి, గుంపులు గుంపులుగా చేరి, ఒక పిల్ల బ్రతుకుతుందా లేదా అని ఆరాటపడు తున్నారు. ఆ పిల్లను రక్షించమని శ్రీరామ చంద్రుణ్నీ, కుంచాలమ్మ తల్లినీ ప్రార్థి స్తున్నారు.

నిమిషం. నిమిషం. అయిదు నిమిషా లయ్యాయి. అయిదు నిమిషాలల్లా పది నిమిషా లయ్యాయి.

కాని, జాడ తెలియలేదు. ఎంత వెదికినా కనిపించలేదు. కాని—

ఆ పది నిమిషాల్లో తల్లులు తమ తమ పిల్లల్ని వెదుక్కోగా, చూసుకోగా ఇద్దరు పిల్లలు కనబడని వైనం బయట పడింది.

ఒక పిల్ల పోయి ఇద్దరు పిల్లలు!

ఒక పిల్లే కనబడలేదనుకుంటే, ఇద్దరు పిల్లలా? సరిపోయింది!

గమ్మత్తేమిటంటే—

ఆ ఇద్దరు పిల్లలూ అంత పెద్ద కొట్లాటకూ కారకులైన పెద్దల పిల్లలు! గంగరాజు, అప్పారావుల చిన్నారి కూతుళ్ళు! దానితో అక్కడ మరీ అలజడి, ఆందోళన ప్రారంభమయ్యాయి.

గంగరాజు, అప్పారావు, వాళ్ళ కుటుం బాలుకూడా అక్కడకు చేరారు గుండెలు బాదుకుంటూ, ఆలో పాలో మని ఏడుస్తూ.

ఆ తరవాత మరో ఇద్దరు ముగ్గురు దిగి వెదికారు.

ఫలితం లేకపోయింది.

అయినా, వెదుకుతూనే ఉన్నారు.

అంతలో ఆ నుయ్యి దగ్గరకు పోలీసులు వచ్చారు. అదంతా చూసి ఏమిటి జరిగిం దని అడిగారు.

అంతా జరిగిందంతా చెప్పారు. పిల్ల పడిపోయిందని కేక వేసిన మనిషినికూడా చూపించారు.

'ఆవిణ్ణి మీరు ఎరుగుదురా?' అడి గారు పోలీసువారు.

అంతవరకూ ఆమె ఎవరో పట్టించు కోని అంబోతులవారూ, గుర్రాలవారూ అప్పటికప్పుడు ఆమె గురించి పట్టించు కొని, చివరకు ఆమె ఎవరో తెలియదన్నా రంతా ఏకకంఠంతో.

'ఆవిడ ఎవరో మీ రెరగరు. కాని, మే మెరుగుదుం ఆవిణ్ణి' అన్నారు పోలీసు వారు గర్వంగా.

'ఆవిడ మీకు తెలుసా! అహా అయితే, ఎవరండీ ఆవిడ?'

'ఆవిడ పిచ్చిది.'

'ఆఁ! ! !'

'అవును. ఆవిడ పిచ్చిది. తన పిల్ల నూతిలో పడి చచ్చిపోవడంతో అప్పట్నించీ పిచ్చిదై పోయింది. పిచ్చాసుపత్రినుంచి తప్పించుకొచ్చేసింది. మేము వెదుకుతున్నది ఈవిణ్ణే!'

అంతమందీ ఆశ్చర్యపోయి స్టిల్ ఫొటోగ్రాఫ్‌లా ఉండిపోయారు.

పోలీసులు పిచ్చిదాన్ని తీసుకుపోవ డంతో ఫొటోలో బొమ్మలు కదిలాయి.

అంబోతుల అప్పారావు, గుర్రాల గంగ రాజు ఒకరి ముఖాలు ఒకరు చూసు కున్నారు.

'అది సరే! మరి మన పిల్లలు ఏమై నట్టు?'

ఆ పిల్లలిద్దర్నీ అంబోతుల వారూ, గుర్రాలవారు అంతా కలిసి అన్ని దిక్కులా, అన్ని పక్కలా వెదక నారంభిం చారు.

పెద్ద కష్టపడ నక్కర్లేకుండానే ఆ పిల్లలు కుంచాలమ్మ గుడి దగ్గర కనిపిం చారు.

ఆ పిల్లలిద్దరూ వానలో తడుస్తూ 'వానా వానా చెల్లప్పా' అని పాడుకుంటూ ఆడుకుంటున్నారు!

ఆ దృశ్యాన్ని చూసి అంబోతుల తలలూ, గుర్రాల తలలూ సిగ్గుతో కిందకు వాలిపోయాయి.

అప్పారావు, గంగరాజు పిల్లల్ని గభాల్ని ఎత్తుకొని ముద్దు పెట్టుకున్నారు.

వర్షం ఇంకా అలా . . . అలా కురుస్తూనే ఉంది.

వర్షంతో అంతా సమంగానే తడు స్తున్నారు. ★

---

## వైద్య విజ్ఞానం

# శ్వాసమండలం

### డాక్టర్ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

మనిషికీ, శవానికీ తేడా జీవం. జీవానికి కొండ గుర్తు శ్వాస. శ్వాస క్రియ జరగకుండా మనిషి కొద్దికాలం కూడా జీవించలేడు. ఆహారమూ, నీరూ లేక పోయినా మనిషి కొంతకాలం జీవించ వచ్చు. కాని, ప్రాణవాయువు లేకుండా జీవించలేడు.

గాలిని లోపలికి పీల్చుకుని, బయటికి వదిలే క్రియనే శ్వాసక్రియ అంటారు. శ్వాసక్రియకు తోడ్పడే అవయవాల క్రమ సరణినే శ్వాసమండలం (శ్వాసకోశం) అంటారు. శ్వాసకోశంలో మొట్టమొదటి భాగం ముక్కు. నాసికారంధ్రాల ద్వారా గాలి లోపలికి ప్రవేశిస్తుంది. ద్వార పాలకుల లాగా ముక్కులో వెంట్రుకలు అమర్చబడి ఉన్నాయి. ఇవి దుమ్మూ, ధూళీ మొదలైన మలినాలను లోనికి పోనివ్వకుండా ఆపివేస్తాయి. ముక్కు లోపలి భాగంలో సన్నని పొర — ఆమత్వచ ఉన్నది. ఇది 'మ్యూసిన్' అనే ద్రవాన్ని ఉత్పత్తి చేస్తుంది. పడిశం పట్టినప్పుడు ఇది బిగటగా ఉండే చీమి డిగా వచ్చేస్తుంది. ముక్కులో ఉండే క్రిమిజాలం కొంతవరకూ దీనితో కడిగి వేయబడుతుంది. కంటిలోనుంచి ముక్కులోకి కన్నీరు కారడానికి ఒక బాష్పనాళం కూడా ఉన్నది. ముక్కు సహాయక శ్వాసేంద్రియం మాత్రమే. ముక్కు ముఖ్యమైన ధర్మం ఘ్రాణ జ్ఞానం. ఇది మనకు సువాసనల మాధు ర్యాలను చవి చూపించే ఘ్రాణేంద్రియం.

నాసికా రంధ్రాలు రెండూ ముక్కు కుహరం లోపల దిగువ భాగంలో ఉండే 'సప్తపథ' (ఫారింక్స్) కు దారి తీస్తాయి. సప్తపథ క్రిందిభాగంలో రెండు నాళాల ద్వారాలున్నాయి. ఒకటి ఆహార నాళం (అన్న నాళిక). ఆహారాన్ని జీర్ణాశయానికి పంపే మార్గం ఇది. రెండ వది శ్వాసనాళం (గాలిగొట్టం). శ్వాస నాళం ముందుభాగంలోనూ, ఆహారనాళం వెనక భాగంలోనూ ఉన్నాయి. నోటిలో నుంచి ఆహారం అన్ననాళికలోకి వెళ్ళ డానికి శ్వాసనాళం మీదుగా వెళ్ళాలి. ఆహారం గాలి గొట్టంలోకి పోకుండా ఉండడానికి శ్వాసనాళం ఆరంభంలో ఒక గుండ్రని మూతలాంటి కవాటం ఒకటి ఉన్నది. దీని పేరు ఎపిగ్లాటిస్ (అధి జిహ్వక). ఇది శ్వాసనాళంలోకి ఆహారాన్ని పోనివ్వకుండా గాలిని మాత్రమే పోనిస్తూ కాపాడుతుంది. అయినా, ఒక్కొక్కసారి ఒకటి రెండు మెతుకులు తప్పుపోవన పడితే విపరీతమైన దగ్గు వచ్చేస్తుంది. తప్పుపోవన పడిన పదార్థం బయటికి వచ్చేదాకా దగ్గు ఆగదు. 'కొరపోవటం' అంటే ఇదే!

గాలిని తీసుకుపోయే శ్వాసనాళం (ట్రాకియా) క్రిందికి వెళ్ళి, రెండు ప్రధాన శాఖలు బ్రాంకైగా చీలుతుంది. ఇవి కుడి, ఎడమ శాఖలు. ఇవి గుండెకాయకు రెండు వైపులా అమరి ఉన్న తిత్తుల్లాంటి మెత్తని శ్వాసకోశాలలోకి ప్రవే శించి, అనేక చీలికలై, శాఖోపశాఖలు — బ్రాంకియోల్స్‌గా వ్యాపిస్తాయి. దూది ఉండల లాంటి ఊపిరితిత్తులలో ఈ శ్వాసనాళికలు కోటానుకోట్లు. ఈ శ్వాస నాళికల చివర వాయుగోళాలు ఉంటాయి. ఈ వాయు గోళాల గోడలలో కేశనాళికలు అమరి ఉంటాయి. వాయువుల సరఫరా జరిగే కేంద్ర స్థానం ఇదే. శరీరం అంతా తిరిగి మలినమైన రక్తం ఈ కేశనాళిక లలో ప్రవహిస్తూ ఉంటుంది. మనం పీల్చే గాలి శ్వాసనాళాల ద్వారా వాయు గోళాలకు వస్తుంది. ఈ గాలిలో ప్రాణ వాయువు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి పీల్చుకున్న గాలిలోని ప్రాణవాయువు కేశ నాళికలలోని రక్తంలోకి ప్రవేశిస్తుంది. రక్తంలో ఉన్న బొగ్గుపులుసు వాయువు వాయుగోళాలలోకి వచ్చేస్తుంది. ఇక్కడ కేశనాళిక గోడా, వాయుగోళం గోడా చాలా పలచగా ఉండడం వల్ల వాయువుల సర ఫరా సులువుగా జరుగుతుంది. దీనివల్ల రక్తం శుభ్రపడి హృదయంలోకి పోతుంది. గాలి మలినమై బయటికి వచ్చేస్తుంది. ★